

చుట్టూ నీళ్లు.. చెట్లన్నీ మోళ్లు!

ఎక్కడైనా నీళ్లు లేకపోతే చెట్లు చనిపోతాయి.. కానీ, ఇక్కడ చుట్టూ నీళ్లున్నా, పెద్ద వృక్షాలు నిలువునా ఎండిపోయాయి. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని వడ్డిచర్ల చెరువులో సుమారు 300 పైగా భారీ నల్లతుమ్మ వృక్షాలు మోళ్లుగా మారాయి. ఇది చూసిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జనగామ జిల్లా ఉద్యాన శాఖాధికారి శ్రీధర్‌రావును వివరణ కోరగా.. చెట్ల వేర్లు నిరంతరం నీటిలో ఉండటంతో శ్వాసక్రియకు ఇబ్బంది ఏర్పడి చనిపోతాయని తెలిపారు. –న్యూస్‌టుడే, లింగాలఘనపురం

ఎస్సైపై బదిలీ వేటు

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్‌ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న లకావత్‌ శ్రీను మృతి వివాదాస్పదంగా మారింది. ఈ కేసులో పలువురిపై కేసు నమోదు కాగా, తాజాగా మంగళవారం ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌పై వరంగల్‌ సీపీ అంబర్‌ కిశోర్‌ ఝా బదిలీ వేటు వేస్తూ, వరంగల్‌ సీసీఎస్‌కు అటాచ్‌ చేశారు. ఆ స్థానంలో నూతన ఎస్సైగా పవన్‌ కుమార్‌ను నియమిస్తూ సీపీ ఉత్తర్వులు వెలువరించారు.


ఈనాడు జనగామ

బుధవారం అక్టోబరు 23, 2024

బ్యాంకుల వద్ద.. దొంగలున్నారు జాగ్రత్త!

జనగామ టౌన్‌, న్యూస్‌టుడే

బ్యాంకుల వద్ద మాటు వేస్తూ.. చాకచక్యంగా నగదు చోరీ చేస్తున్న ముఠా జిల్లాలో సంచరిస్తోంది. బ్యాంకుల్లో నగదు డ్రా చేసుకుంటున్న వారిని దగ్గరగా గమనిస్తూ నగదు చోరీ చేస్తున్న అగంతకులతో బ్యాంకు ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఇలాంటి పలు చోరీ సంఘటనలు జరుగుతుండటంతో పోలీసులు కూడా అప్రమత్తమై బ్యాంకుల వద్ద భద్రతా చర్యలతో పాటు ముఠాను పట్టుకోవడానికి రంగంలోకి దిగారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నట్లు కనిపించినా నగదు తస్కరిస్తున్నారు.



కర్ణాటక దొంగల ముఠాగా అనుమానం..

జనగామలో మూడు నెలల క్రితం జరిగిన చోరీ ఘటనలో జనగామ క్రైమ్‌ ఎస్సై మోదుగుల భరత్‌ నేతృత్వంలో క్రైమ్‌ విభాగం పోలీసులు చోరీ దర్యాప్తులో భాగంగా నిందితుల్లో కర్ణాటకకు చెందిన ఒకరిని అరెస్టు చేశారు. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో బ్యాంకుల వద్ద చోరీలు వెలుగుచూడటంతో కర్ణాటకు చెందిన ముఠా సభ్యులుగానే అనుమానిస్తూ దర్యాప్తు చేపట్టారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి..

చాకచక్యంగా మాటలు కలిపి, నగదు కాజేస్తున్న అగంతకుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. దొంగలు వృద్ధులు, నడి వయస్కులు, అంతగా చదువు రాని వారిని లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలడంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, నడి వయస్కుల వారు బ్యాంకులకు వెళ్తున్న తరుణంలో వెంట ఒకరిని తీసుకువెళ్తే క్షేమం. అలాగే నిరక్షరాస్యులు డ్రా చేసిన తరువాత ఏమరుపాటుగా ఉండొద్దు. కార్లు, ద్విచక్రవాహనాల్లో డబ్బులను పెట్టుకున్నప్పుడు నిర్లక్ష్యం వహించరాదు. బ్యాంకు లోపల, బయట పూర్తిగా సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలని, పార్కింగ్‌ వద్ద కూడా పలు జాగ్రత్త చర్యలు, సెక్యూరిటీ గార్డుల సాయం తీసుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. బ్యాంకులతో పాటు మార్గ మధ్యలో ఖాతాదారులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని చెబుతున్నారు.

జిల్లాలో వరుస సంఘటనలు.. ఖాతాదారుల బెంబేలు

జనగామ పట్టణంలో మూడు నెలల క్రితం ఓ బ్యాంకులో నగదు విడుదల చేసుకున్న వ్యక్తిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు నుంచి గమనిస్తూ బయటకు వెళ్లే క్రమంలో ద్విచక్రవాహనాలపై వెంబడించారు. ఆయన నగదును కారులో పెట్టి, మధ్యలో ఓ పని మీద వాహనాన్ని నిలిపివేశారు. దీంతో వారు కారు అద్దాలను పగులగొట్టి రూ.2లక్షలను చోరీ చేశారు.


☛ అలాగే గత నెల 18న జనగామలోని ఓ బ్యాంకులో డబ్బులను డ్రా చేసిన వ్యక్తిని బ్యాంకులోనే ఉండి గమనించిన అగంతకులు ద్విచక్రవాహనాలపై వెంబడించారు. మధ్యలో కారు ఆపిన క్రమంలో దుండగులు అద్దాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు.

☛ స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆరు రోజుల కింద ఓ ఖాతాదారుడు పంట రుణం, గృహ రుణం కింద రూ.3.10 లక్షలు తీసుకొని వాహనంలో పెట్టుకున్నాడు. తిరిగి వెళ్తుండగా దుండగులు మాటు వేసి అపహరించుకుపోయారు. బాధితుడు లబోదిబోమంటూ విలపించాడు.

☛ దేవరుప్పుల మండలంలో కొద్ది రోజుల కింద ఓ ఖాతాదారుడు రూ.40 వేలను డ్రా చేసుకొని తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. తిరుగు పయనంలో దుండగులు వెంబడించి, మాటలతో మైమర్చి కవర్లో ఉన్న డబ్బును తస్కరించారు. ఇలా వరుస చోరీలు జరగడం గమనార్హం.

బ్యాంకుల వద్ద ప్రత్యేక దృష్టి సారించాం..

- రాజమహేంద్రనాయక్‌, డీసీపీ



బ్యాంకుల వద్ద ఖాతాదారుల నుంచి నగదు కాజేస్తున్న ఘటనలు జరగడంతో అప్రమత్తత చర్యలు ప్రారంభించాం. బ్యాంకు అధికారులకు సీసీ కెమెరాలు, ఇతర భద్రత చర్యలు తీసుకోవాలని సూచించి జిల్లా వ్యాప్తంగా అమలు చేయిస్తున్నాం. చోరీ ఘటనలపై దర్యాప్తు చేపట్టాం. సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేయిస్తున్నాం.



ధాన్యంతో నిండిన కవర్‌షెడ్‌..



కార్మికులకు తప్పని ఎదురుచూపులు

పోటెత్తిన ధాన్యం.. కొనుగోళ్లలో జాప్యం!

జనగామ, న్యూస్‌టుడే: పొద్దంతా ఎండ, సాయంత్రం అయ్యేసరికి కారు మబ్బులు కమ్ముకునే వాతావరణం, అడపదడపా, అక్కడక్కడా వర్షాలు. మరో వైపు వరి కోతలు ముమ్మరమయ్యాయి. విచిత్ర వాతావరణం, నోటికాడికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు 20 శాతం ప్రారంభమయ్యాయి. కానీ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం సిద్ధం చేయలేక అన్నదాతలు వ్యవసాయ మార్కెట్లను, ప్రైవేటు కొనుగోలుదారులను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌కు గత పక్షం రోజులుగా వేలాది బస్తాల ధాన్యం వస్తోంది. బతుకమ్మ, దసరా సెలవులు, దుర్గమ్మ పండగ సెలవులు, సాధారణ సెలవులతో తోడు ప్రత్యేక సెలవులతో మార్కెట్‌ కష్టాలు పడక తప్పడం లేదు.

ధాన్యం వెల్లువెత్తినప్పుడు ఉదయం 9.30కు తొలివిడత బీటు ప్రారంభించాలని, మధ్యాహ్నం రెండో విడత ప్రారంభిస్తే రైతులకు వేచిఉండే ఇబ్బంది తప్పుతుందని మార్కెట్‌ నిపుణులు సూచిస్తారు.

అదనపు సెలవుతో ఇబ్బందులు..

శనివారం మార్కెట్‌ వేలం ముగిసినప్పటి నుంచి మంగళవారం ఉదయం కొనుగోళ్లు ప్రారంభమయ్యే సమయానికి 13249 బస్తాల ధాన్యం వచ్చింది. ఆదివారం సెలవు, సోమవారం మార్కెట్‌ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా సెలవు ప్రకటించలేక, అడ్తీదారులు చెల్లింపులకు డబ్బు లేదని, ఒక రోజు సెలవు అడిగారనే సాకుతో క్రయ, విక్రయాలు నిలిపారు.

ఇనామ్‌ మొరాయింపు..

మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా ఇనామ్‌ సర్వర్‌ పని చేయలేదు. సోమవారం సైతం అన్ని మార్కెట్లకు ఇదే ఇబ్బంది ఉందని చెబుతున్నారు. దీంతో మాన్యువల్‌గా టెండర్లు వేశారు. అధిక ధరలను తెమల్చేసరికి సాయంత్రం అయింది. మూడు రోజుల నుంచి వేచి ఉన్న కర్షకులకు మంగళవారం సైతం పడిగాపులు తప్పలేదు. మిల్లర్లు, ఖరీదుదారులు, ఎగుమతి దారులు సుమారు 60 మంది ఉన్నా కేవలం ఎనిమిదుగురు మాత్రమే ఖరీదుకు వచ్చారు. దీంతో ఆశించిన ధరలు రాలేదని, పెద్ద ఎత్తున ధాన్యం వచ్చినప్పుడల్లా ధాన్యం ధర తగ్గుతోందని రైతులు వాపోయారు. వ్యాపారస్తులు మాత్రం బయట డిమాండ్‌ లేని కారణంగా ధరలు తగ్గుతున్నాయంటున్నారు. నూతన ఛైర్మన్‌ బనుక శివరాజ్‌యాదవ్‌ క్రయ, విక్రయాల సరళిని పరిశీలించి, ఇనామ్‌ సమస్య నేపథ్యంలో ప్రత్యేక చర్యలకు ఆదేశించారు.

కాటమయ్య కిట్లతో గీత కార్మికులకు భద్రత



గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్‌, న్యూస్‌టుడే: కల్లుగీత కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం గీతన్నలకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్‌ కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నియోజకవర్గ స్థాయి కల్లుగీత కార్మికులకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో కడియం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికుల ప్రాణాలకు ప్రజా ప్రభుత్వ అభయహస్తం కాటమయ్య రక్షణ కవచమని అన్నారు. రక్షణ కవచం పేరిట ఆరు పరికరాలతో కిట్‌ను సిద్ధం చేసి అందిస్తోందన్నారు. గ్రామాల వారీగా ఎక్కువ మొత్తంలో శిక్షణ ఇవ్వాలని కడియం అధికారులకు సూచించారు. గీతన్నల పెండింగ్‌ ఎక్స్‌గ్రేషియా సైతం త్వరలో మంత్రితో మాట్లాడి విడుదల చేయిస్తామని భరోసానిచ్చారు. గత 15 సంవత్సరాలు నియోజకవర్గం ప్రజలు ఆశించిన అభివృద్ధి చెందలేదని.. రాజకీయం అంటే అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యలు పరిష్కరించడం మాత్రమేనని కానీ గత పాలకులు ఇవి మరిచి పాలన సాగించి, పదవులు, పనులు అమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను అందించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్‌, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ప్రవీణ్‌, కేడీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లి వెంకటమల్లయ్య, ఆర్డీవో వెంకన్న, మార్కెట్‌ ఛైర్మన్‌ లావణ్య, కేడీసీసీ మండలాధ్యక్షుడు రఘురాములు, ఎక్సైజ్‌ సీఐ భాస్కర్‌ రావు, నాయకులు పాల్గొన్నారు.

26న ధర్మయుద్ధ మహాసభ

స్టేషన్‌ఘన్‌పూర్‌, న్యూస్‌టుడే: వరంగల్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్‌ మాదిగ అన్నారు. డివిజన్‌ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ దేశంలోనే ముందుగా తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి వర్గీకరణ చేయకుండానే వివిధ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేసే కుట్రలను మానుకోవాలని డిమాండ్‌ చేశారు. ముఖ్యమంత్రి వైఖరిని నిరసిస్తూ 26న జరిగే ధర్మయుద్ధ మహాసభకు మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌, రవీందర్‌, పలియా, శ్రీనివాస్‌, అశోక్‌ పాల్గొన్నారు.

శబరిమల రైలును వినియోగించుకోవాలి

జనగామ టౌన్‌, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే నూతనంగా శబరిమలకు భారత్‌ గౌరవ్‌ రైలు నడిపించనున్నట్లు ఇండియన్‌ రైల్వే క్యాటరింగ్‌ అండ్‌ టూరిజం కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (ఐఆర్‌సీటీసీ) టూరిజం ఎగ్జిక్యూటివ్‌ అధికారి పవన్‌కుమార్‌ సెంగార్‌ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. శబరిమలకు భారత్‌ గౌరవ్‌ రైలు నవంబర్‌ 16న సికింద్రాబాద్‌ నుంచి బయల్దేరుతుందని చెప్పారు. యాత్ర ఐదు పగళ్లు, నాలుగు రాత్రులు ఉంటుందని, అన్ని సదుపాయాలు రైల్వే కల్పిస్తోందన్నారు. వసతి సౌకర్యాలు కూడా తామే కల్పిస్తామన్నారు. భారత్‌ గౌరవ్‌ రైల్లో శబరిమల వెళ్లడానికి గాను స్లీపర్‌ ఛార్జీ రూ.11,475, థర్డ్‌ ఏసీ రూ.18,790, సెకండ్‌ ఏసీ రూ.24,215 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో భారతదేశంలోని వారణాసితో పాటు దేశంలో ప్రసిద్ధి చెందిన దర్శనీయ స్థలాలకు గౌరవ్‌ రైలును ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్యాకేజీల కింద నడిపించనున్నట్లు వారు వివరించారు. సమావేశంలో టూరిజం మానిటర్‌ శ్రీకాంత్‌, డీఈవో నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఆర్‌సీటీసీ అధికారులు

బాలికలు లక్ష్యాలను చేరుకోవాలి



ప్రసంగిస్తున్న కలెక్టర్‌ రిజ్వాన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్‌, రోహిత్‌సింగ్‌, తదితరులు

జనగామ అర్బన్‌, న్యూస్‌టుడే: బాలికలందరూ శ్రద్ధగా చదువుకొని, జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా అన్నారు. అక్టోబరు 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు దసరా సెలవులు ఉండడంతో మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్‌, రోహిత్‌సింగ్‌లతో కలిసి కలెక్టర్‌ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. ఏ పోటీల్లో చూసినా టాప్‌-10లో బాలికలే పైచేయి సాధించడం అభినందనీయమన్నారు. పోటీతత్వం కొనసాగించాలని కాంక్షించారు. వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా గాంధీ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ఫ్లొరెన్స్‌, డీఆర్డీవో పీడీ వసంత, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కస్తూర్బా విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శన

కళల సంరక్షణకు కళాకారులను బతికించాలి



సమీక్షలో ఉపన్యసిస్తున్న ఒగ్గు రవికుమార్‌

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: ప్రాచీన జానపద కళలు అంతరించిపోకుండా సంరక్షించుకోవాలని, కళాకారులను బతికించుకోవాలని ఈ విషయాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉస్తాద్‌ బిస్మిల్లాఖాన్‌ అవార్డు గ్రహీత ఒగ్గు రవికుమార్‌ తెలిపారు. భారత ప్రభుత్వం, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 21 వరకు దిల్లీలో నిర్వహించిన 'అంతర్జాతీయ భారత నృత్యోత్సవం' కార్యక్రమ పరిశీలకులుగా రవికుమార్‌ వ్యవహరించారు. అనంతరం మధుర ఎంపీ హేమమాలినీ, ఎస్‌ఎన్‌ఏ ఛైర్మన్‌ సంధ్యాపురేచ్చా, కార్యదర్శి రాజుదాస్‌ పాల్గొన్న సమావేశంలో 'తెలుగు జానపద కళలు-గురుశిష్య పరంపర' అంశంపై విస్తృత సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. జానపద కళల కళాకారుల దీనస్థితిని వివరించినట్లు పేర్కొన్నారు. కళాకారులకు ఉచిత వైద్యం, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని సంగీత నాటక అకాడమీని కోరినట్లు తెలిపారు. ఒగ్గు కళాక్షేత్రం నిర్మాణం కోసం ప్రస్తావించగా సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించనున్నట్లు హామీ ఇచ్చారన్నారు.

పకడ్బందీగా లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్‌

జనగామ టౌన్‌, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన చేసుకుని, పకడ్బందీగా అమలు చేయడానికి వైద్యారోగ్య సిబ్బంది పని చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ రవీందర్‌గౌడ్‌ సూచించారు. పట్టణంలోని అర్బన్‌ పీహెచ్‌సీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆడపిల్లల రేషియో శాతం తగ్గిపోతుందని, మొదట ఆడపిల్ల పుట్టి రెండో కాన్పు కోసం వేచిచూస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏవైనా స్కానింగ్‌ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలిస్తే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. సమీక్షలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు సుధీర్‌, శ్రీదేవి, వైద్యులు భాస్కర్‌, మాస్‌ మీడియా అధికారి ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సత్రంలో చిల్పూర్‌ ఠాణా



గౌడ సంఘం భవనంలో తహసీల్దార్‌ కార్యాలయం

ఏడేళ్లుగా.. అద్దె భవనాల్లోనే కార్యాలయాలు

న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్‌ : ఏడేళ్ల క్రితం చిల్పూర్‌ మండల కేంద్రంగా ఏర్పడింది. . ఇంతవరకు సొంత భవనాలు లేక తహసీల్దార్‌ ఎంపీడీవో, పోలీస్‌ స్టేషన్‌ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అత్యవసర సమావేశాలు ఆరుబయటే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీస్‌స్టేషన్‌ను ఆలయ సత్రంలో ఏర్పాటు చేయడంతో గుట్ట అడ్డుగా ఉండి ఫోన్‌ సిగ్నల్‌ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కోతుల బెడద నెలకొంది. పోలీస్‌స్టేషన్‌ నిర్మాణానికి అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు పలుమార్లు స్థల పరిశీలన చేసినా అక్కడే ఆగిపోయింది. మండలం ఏర్పడినప్పటికీ నేటికి ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని స్థానికులు వాపోతున్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలోనైనా భవన నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



చిల్పూర్‌లో పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎంపీడీవో కార్యాలయం

త్వరలోనే మండల సముదాయ భవనం

- ఎమ్మెల్యే, కడియం శ్రీహరి, స్టేషన్‌ఘన్‌పూర్‌

నూతనంగా ఏర్పడిన చిల్పూర్‌ మండలంలో కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాటు.. చాలా సమస్యలున్నాయి. వాటన్నింటినీ త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తా.. అన్ని ప్రతిపాదనలు పంపాం. మంజూరు రాగానే పనులకు శంకుస్థాపనలు చేస్తాం..



పందులు.. కుక్కల స్వైర విహారం

జనగామ టౌన్‌, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని సిద్దిపేట రోడ్డు వైపు నెహ్రూ పార్కు సమీపంలోని వినాయక్‌నగర్‌ తదితర కాలనీల్లో పందులు, కుక్కలు పదుల సంఖ్యలో సంచరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వినాయక్‌నగర్‌ కాలనీలో పందుల బెడద తీవ్రంగా ఉంది. కాలనీలో అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్న పందుల బెడదకు, అలాగే వీధి కుక్కలతో ప్రమాదానికి ఆస్కారం ఉందని.. పుర అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.



మూడు వైపులా.. కష్టాలే!

పద్మవ్యూహంలో హనుమకొండ బస్టాండ్
ఛేదించడానికి ఉన్నాయి మార్గాలు
పరిశీలన

నిత్యం వేలాది ప్రైవేటు వాహనాలు, కార్ల రాకపోకలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు ఇవన్నీ హనుమకొండ బస్టాండు ప్రాంతంలో కనిపించే ట్రాఫిక్ కష్టాలు. నగరవాసులు ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు కీలకమైన హనుమకొండ ప్రధాన బస్టాండులో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రత్యామ్నాయ మార్గాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..
–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

ఎవరికి నచ్చినట్టు వారు..


ఆటోలు, ఫుట్‌పాత్‌లపై వాహనాలు

బస్టాండు లోపలికి వెళ్లే రెండు దారులు గందరగోళంగా ఉంటాయి. ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు బస్టాండు నుంచి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అక్కడే చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ సమస్యలు తెస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్‌లకు వచ్చే వారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది.

కట్టడి చేయడం కీలకం

☛ ఆటోవాలాలు క్రమ పద్ధతిలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలి. ☛ బస్టాండు రోడ్డుకు రెండు వైపులా ప్రైవేటు ఆసుపత్రుల వారు ఆక్రమించుకున్న ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి. పాదచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.


1 ఇది కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి.. బస్టాండ్‌లోని బస్సులన్నీ దీని ద్వారానే బయటకు వెళ్లాలి



సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

- నార్లగిరి రమేష్, ప్రయాణికుడు, హనుమకొండ



బస్టాండు రోడ్డు నుంచి మచిలీబజార్, పద్మాక్షిరోడ్డుకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నడుస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో పాటు, నగపాలక సంస్థ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

ప్రైవేటు వాహనాలను అడ్డుకుంటున్నాం..

- విజయభాను, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్



బస్టాండులోకి ప్రైవేటు వాహనాల రాకకు పూర్తిగా అడ్డుకట్ట వేశాం. కాజీపేట, ములుగు రోడ్డు, పెట్రోల్‌పంపుల నుంచి కొన్ని బస్సులను నేరుగా పంపించేందుకు అక్కడ అనువైన స్థలం లేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తున్నాం.


2 ఇది కీలకమైన జంక్షన్ దారి.. దీన్ని మూసివేయడంలో ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది.

మూడు మార్గాలు ఉన్నా..

బస్టాండు లోకి వెళ్లడానికి మూడు దారులున్నాయి. కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి, బస్టాండు జంక్షన్ పక్కన ఒకటి, మసీదు పక్కన మరొకటి. అన్ని మార్గాల గుండా వచ్చే బస్సులు మసీదు పక్కన ఉన్న గేటు నుంచే బస్టాండ్‌లోనికి అనుమతి ఇస్తున్నారు. వందలాది బస్సులు ఇదే మార్గంలో లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు బస్సులన్నీ కేడీసీ దారిలో ఉన్న గేటు గుండా బయటకు వెళ్తుంటాయి.. కీలకమైన బస్టాండ్ జంక్షన్ దారిని ప్రమాదాలు జరుగుతున్నాయని మూసివేశారు.

ఇలా చేద్దాం

☛ గతంలో మాదిరిగానే బస్సులు లోపలికి వచ్చే మార్గాలు రెండు ఉండాలి.

☛ ఏటూరునాగారం, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట రూట్లలో వచ్చే బస్సులు హనుమకొండ చౌరస్తా మీదుగా మసీదు పక్క ఉన్న దారి గుండా లోపలికి వెళ్లాలి.

☛ హైదరాబాద్, కరీంనగర్, నిజమాబాద్, జనగామ నుంచి వచ్చే బస్సులు జంక్షన్ వద్ద ఉన్న మార్గం ద్వారా లోపలికి వెళ్లే ఏర్పాటు చేయాలి.

☛ ప్రమాదాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను ఉంచాలి. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేయగలిగితే ప్రమాదాలు జరగవు.


3 ఇది మసీదు పక్క నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే దారి.. బస్సులన్నీ ఇక్కడి నుంచే లోపలికి వెళ్లాలి..

వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ డిపోలు	9	మొత్తం బస్సులు	908	నిత్యం హనుమకొండ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సంఖ్య	60 వేలు	ఉమ్మడి ఆరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు	1200	ప్రయాణించే మార్గాలు	374


ములుగు రోడ్డు బస్టాండు

ఇదీ పరిస్థితి

హనుమకొండ బస్టాండు ఇరుకుగా ఉంటుంది. పక్కపక్కనే ప్లాట్‌ఫారాలు ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి బయటకు వెళ్లాలంటే గంటల కొద్ది సమయం వృథా అవుతోంది. ప్రయాణికులూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పరిష్కారం

☛ హైదరాబాద్ తరహాలో బస్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఎంజీబీఎస్ ప్రధాన బస్ స్టేషన్ ఉన్నప్పటికీ కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఎక్కువ సంఖ్యలో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడుస్తాయి. వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి నడుస్తాయి. అదే తరహాలో ఇక్కడ కరీంనగర్, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక బస్‌స్టేషన్ నుంచి పంపిస్తే ఇబ్బందులు తీరుతాయి.

☛ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో 20 శాతం బస్సులను హనుమకొండ బస్టాండు నుంచి కాకుండా కాజీపేట బస్టాండు నుంచి పంపిస్తే సగం ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు ఆర్టీసీకి డీజిల్ ఆదా అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు.

☛ ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ వెళ్లే వాహనాలు నేరుగా ములుగు రోడ్డు నుంచి వెళ్లేలా చూడాలి.

☛ కరీంనగర్, నిజామాబాద్ బస్సుల్లో కొన్నింటిని హనుమకొండ పెట్రోల్ పంపు నుంచి నేరుగా పంపించొచ్చు.

☛ రిజర్వేషన్ బస్సులను సైతం మరో చోటు నుంచి పంపించే ఏర్పాటు చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.


కాజీపేట బస్టాండు


విలేకరుల సమావేశంలో కథానాయిక అనన్య, హీరో యువ చంద్రకృష్ణ

'పొట్టేల్' సినిమా బృందం సందడి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నగరంలో 'పొట్టేల్' సినిమా బృందం సందడి చేసింది. ఆకట్టుకునే కథ, మెప్పించే కథనంతో ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'పొట్టేల్' సినిమాను ఆదరించాలని కథానాయకుడు యువ చంద్రకృష్ణ, కథానాయిక అనన్య ప్రేక్షకులను కోరారు. మంగళవారం వరంగల్ వెంకట్రామా థియేటర్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వరంగల్‌కు చెందిన నిషాంత్ రెడ్డి, సురేశ్ చిత్రాన్ని నిర్మించారని, పక్కా పల్లె వాతావరణం, చిన్నపాప చదువు కోసం మేం పడిన కష్టం ఈ సినిమాలో కనిపిస్తుందని చిత్ర బృందం తెలిపింది. గురువారం సినిమా విడుదలవుతోందని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశామని, తెలంగాణలో వరంగల్ నుంచే మొదలు పెడుతున్నామని వివరించారు. ఓటీటీలో కాకుండా సినిమాను థియేటర్ లోనే చూడాలని అభ్యర్థించారు. అంతకు ముందు హీరో యువ చంద్రకృష్ణ త్రీస్టార్ డాన్స్ చేశారు. సమావేశం అనంతరం సినిమా పోస్టర్లను ఆవిష్కరించారు. కథానాయిక అనన్యతో స్వీయచిత్రం దిగడానికి అభిమానులు పోటీపడ్డారు.


అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25న నిర్వహించాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా వేస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇతర క్రీడాంశాలు షెడ్యూల్ ప్రకారమే ఉంటాయన్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)

ఫారంకోడి:	125	డ్రెస్డ్:	213
రిటైల్:	147	స్కిన్‌లెస్:	243

ప్రధాని మోదీ ప్రత్యుత్తరం.. మురిసిన విద్యార్థులు


प्रधान मंत्री
Prime Minister
New Delhi
01 October, 2024
Shri Nagchetanya Ji,
Heartfelt gratitude to you for sending warm birthday wishes. I am overwhelmed to receive greetings from my family members such as yourself from across the country.
Your trust, support and cooperation are my real treasure. Your affectionate words fill me with new energy to strive in service of the nation. In the third term of our government, my resolve to fulfil the aspirations of the people and take India to great heights of progress has further strengthened.
Powered by the ability of our people and the skills of our youth, we have been setting new benchmarks in development over the last 10 years. Amrit Kaal is an opportunity to scale up our efforts to build a developed, inclusive and self-reliant nation.
The contribution of every Indian towards the progress of the nation is deeply valued.
With best wishes for your good health, happiness and prosperity.
Yours,
(Narendra Modi)
Shri Nagchetanya
Near Hanuman Temple
Telangana

గుండెంగ యూపీయస్ విద్యార్థులకు ప్రధాని రాసిన ప్రత్యుత్తరం


ప్రధాని రాసిన లేఖలతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

దేవరుప్పుల (జనగామ జిల్లా), మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7వ తరగతుల విద్యార్థులు వారంతా.. పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొడిపాక రమేశ్ ప్రోత్సాహంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ హిందీలో లేఖలు రాసి పోస్టు చేశారు. సోమవారం ప్రధాని కార్యాలయం నుంచి 'ధన్యవాదాలు' అంటూ ప్రత్యుత్తరం అందింది. దీంతో ఆ పల్లె వాసులు, విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కిషన్, చీకటి శ్రీను, కందిక దామోదర్, ప్రధానోపాధ్యాయుడు రాజు సమక్షంలో వాటిని విద్యార్థులకు అందించడటంతో పండగ వాతావరణం నెలకొంది.



భద్రపరుచుకుంటాం..

- మణిహర్షిత, ఏడో తరగతి

గత నెలలో పోస్టుకార్డుతో ప్రధాని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ మాస్టారు లేఖ రాయమంటే రాసి మరిచిపోయాం. ప్రస్తుతం తిరిగి లేఖ రావడంతో విద్యార్థులం అంతా చాలా ఆనందపడ్డాం. ఆంగ్లంలో వచ్చిన లేఖను ఉపాధ్యాయులు చదివి తెలుగులో వివరించారు. దేశ ప్రధాని నుంచి వచ్చిన ప్రత్యుత్తరం ఫ్రేమ్ కట్టించి ఇంట్లో భద్రపరుచుకుంటాం.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ జిల్లా పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి, 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేశాడు. దీంతో అతనిపై ఖమ్మం జిల్లా పరిధిలో సుమారుగా 10కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ.800తో మరో నకిలీ తుపాకీ కొనుగోలు చేశాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 21న ఖమ్మం నుంచి రైలులో వరంగల్‌కు చేరుకుని అర్ధరాత్రి వేళ ఊరుగొండ వద్ద ఆటో దిగాడు. అక్కడ కిరాణం దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్ర లేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ.2000 తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ దుండగుడు వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే చేరుకున్న స్థానికులు అతణ్ని బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దుండగుడు వెంకటేశ్వర్లు వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరి వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఉన్నారు.


విరాలు వెల్లడిస్తున్న పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్

సీతాఫలాల విక్రయాలు.. రాకపోకలకు తిప్పలు!




జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు వైపు యూటర్న్ వద్ద బైపాస్ రహదారిపైనే సీతాఫలాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు సీతాఫలాల కొనుగోళ్లకు ఆగడంతో కొంత మేర రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి పక్కగా కూర్చుంటే ఇబ్బందిగా ఉండదని విక్రయదారులుకు పోలీసులు సూచిస్తున్నారు.
– న్యూస్‌టుడే, జనగామ టౌన్

వరిసాగు అందం.. తేయాకు తోటల చందం



ఈ చిత్రం చూస్తుంటే అస్సాం రాష్ట్రంలోని తేయాకు తోటలను తలపిస్తున్నాయి కదూ. ఇది వరి విత్తనోత్పత్తి క్షేత్రం. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ శివారులో కావేరి విత్తన సంస్థ ఆధ్వర్యంలో రైతు ఆడ, మగ వరిని నాటారు. మగ వరి కోసి వేరు చేయడంతో మిగిలిన పంట తేయాకు తోటలో పాదుల్లాగ ఇలా కనిపిస్తోంది. దారిన పోయే బాటసారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.
– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి

హరిత గిరి.. కొలువైన శ్రీహరి



పచ్చదనంతో అలరారుతూ ఆహ్లాదకరంగా ఉన్న ఈ కొండ హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని ఎర్రగట్టు గుట్ట. దీనిపై అనేక రకాల ఔషధ మొక్కలు, మధుమేహాన్ని నియంత్రించే తిప్పతీగ, చర్మ వ్యాధులను నయం చేసేందుకు వాడే గడ్డిపూల జాతి మొక్కలు ఉన్నాయి. వీటితో నల్లనేరేడు, సీతాఫలాలు, వేప తదితర వృక్షాలు ఉన్నాయి. ఈ గుట్టపైనున్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీహరి భక్తులకు కనులవిందుగా దర్శనమిస్తున్నారు.
– ఈనాడు హనుమకొండ, న్యూస్‌టుడే భీమారం

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం


పోటీపడుతున్న క్రీడాకారులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ చదరంగం సంఘం సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు మంగళవారం హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో ప్రారంభమయ్యాయి. వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో రాణించాలని సూచించారు. అనంతరం బాలలతో చదరంగం ఆడి ఉత్తేజపరిచారు. పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా, ఆర్బిటర్స్ సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.


పార్కు ముఖద్వారం


నెలకొన్న పచ్చదనం


ఓపెన్‌జిమ్‌లో కసరత్తు

ఆహ్లాదకరం యతిరాజారావు పార్కు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్ కేంద్రం తొర్రూరు. సుమారు 30 వేల పైచిలుకు జనాభా కలిగిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి రోజు సుమారు 2-3 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరులో ప్రజల సౌకర్యార్థం దివంగత నేత నెమరుగొమ్ముల యతిరాజారావు స్మారకంగా ఆయన పేరున ఏడెకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. మూడేళ్ల కింద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.2 కోట్లు కేటాయించి, అందులో ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, సేద తీరడానికి ప్రత్యేక బల్లలు, హట్స్, చూడముచ్చటైన విగ్రహాలు, ప్రత్యేకంగా వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆటవిడుపుగా నిలుస్తోంది. చుట్టూ వాకింగ్‌ట్రాక్, నర్సరీ నుంచి మొక్కలను తెప్పించి నాటడంతో పచ్చందాలను సంతరించుకుంటుంది. అలాగే ఇక్కడ విజయదశమి నాడు రావణవధ కూడా ఘనంగా నిర్వహిస్తారు. క్రీడా పోటీలు, పలు చిత్రాల షూటింగ్‌లు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. నిత్యం 50 నుంచి 100 పిల్లలు కరాటే శిక్షణ పొందుతారు. ఇక సెలవు రోజుల్లో అయితే జనాల రాకతో కిక్కిరిసి కనిపిస్తుంది.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


వెల్దండలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, తదితరులు

నర్మెట్ట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. మంగళవారం మండలంలోని హన్మంతాపూర్, మల్కాపేట, మచ్చుపహాడ్, గండిరామవరం, అమ్మాపురం, వెల్దండలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. భారాస నాయకులు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ధరావత్ లక్ష్మి, ఏసార్ల అంజయ్య, ఏపీఎం మాదారపు రవి, సీసీలు యాదగిరి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో భక్తుల పూజలు



చిల్పూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని చిల్పూర్‌గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. అర్చకులు స్వామివారికి బంగారు పద్మాలతో అష్టదళ పాదపద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తులు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో మోహన్, అర్చకులు రవీందర్ శర్మ, సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కాలువ అధ్వానం.. సాగు ప్రశ్నార్థకం!

నర్మెట్ట నుంచి వెల్దండకు వెళ్లే రహదారి మధ్యలో ఉన్న సాగునీటి కాల్వలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, నీటి పారకం అయోమయంగా మారింది. నీరు విడుదల చేసినప్పుడు ప్రవాహంలో అంతరాయం ఏర్పడుతోందని సమీప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నర్మెట్ట



మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పలు వార్డుల్లో రహదారులు లేక పోవడంతో వర్షాలకు బురదమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- నర్సయ్య, జఫర్‌గఢ్

సమాధానం: పంచాయతీ నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపడుతాం.

- రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి, జఫర్‌గఢ్

● జఫర్‌గఢ్ మండలం సూరారం నుంచి హిమ్మత్‌నగర్‌కు వచ్చే ప్రధాన రహదారి కోతకు గురి నాలుగేళ్లు కావస్తున్న శాశ్వత మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- రాజు, సూరారం.

సమాధానం: రహదారి మరమ్మతుల కోసం అంచనాలు ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగనే పనులు మొదలుపెడతాం. **- రామకృష్ణ, పీఆర్ ఏఈ, జఫర్‌గఢ్,**

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే రహదారి వెంట పిచ్చి మొక్కలు పెరిగాయి. తొలగించాలి. **- కాలనీవాసులు**

సమాధానం: తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

- నర్సింహాచారి, పంచాయతీ కార్యదర్శి

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు భారీగా పెరిగాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- సంతోష్, పాలకుర్తి**

సమాధానం: సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకుంటా. **- వెంకటేశ్వరచారి, పంచాయతీ కార్యదర్శి**

సీపీఎంతోనే ప్రజా సమస్యల పరిష్కారం



జనగామ టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఎం మాత్రమే పోరాటాలు చేస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. జనగామ మండలం అడవికేశ్వాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం పార్టీ కార్యాలయంలో కనకారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో భాజపా, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉండి బూర్జువా శక్తులకు ఊడిగం చేస్తూ పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, నరేందర్, ధర్మభిక్షం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘చెకుముకి’ గోడపత్రికల ఆవిష్కరణ


ఆవిష్కరణలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో డీఈవో రాము, జేవీవీ బాధ్యులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్-2024కు సంబంధించిన గోడపత్రికలను కలెక్టర్ రిజ్వాన్‌బాషా, డీఈవో రాముతో కలిసి జేవీవీ బాధ్యులు మంగళవారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. నవంబర్ 7న పాఠశాల, 21న మండల, 28న జిల్లా, డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్‌లో రాష్ట్ర స్థాయి టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. పూర్తి వివరాలకు 9346402030, 9989354662 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు మాసాన్‌పల్లి లక్ష్మణ్‌జీ, కేఎల్. మర్రెడ్డి, పి. చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి కృషి..

జనగామ అర్బన్: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి కృషిచేస్తామని కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, అంబేడ్కర్ భవనం, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు, స్టడీ సర్కిల్ భవనాల ఏర్పాటు తదితర అంశాలపై డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి కలెక్టర్ చర్చించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విక్రమ్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డా.రాజమౌళి, రాగల్ల ఉపేందర్, జి. కృష్ణ, సత్యనారాయణ, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభం సరి

స్పందనకు వందనం



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: చీటూరులో దుర్గామాత ఆలయం సమీపంలోని కాలనీలో విద్యుత్తు స్తంభం ఒక వైపు ఒరిగింది. ఈ నెల 21న ఈనాడులో ‘కూలితే ప్రమాదమే’ శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో ఏఈ తురుగొండ శంకరయ్య స్పందించి తమ సిబ్బందితో సరి చేశారు.

మహిళా ప్రయాణికులకు బహుమతులు


లక్కీడిప్ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు ప్రతి 15 రోజులకోసారి లక్కీడిప్ ద్వారా బహుమతులు అందిస్తున్నారు. ఈ మేరకు జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఆర్టీసీ అధికారులు మహిళా ప్రయాణికుల టికెట్లను లక్కీడిప్ నిర్వహించారు. మొదటి బహుమతిని డి. శకుంతల, రెండో బహుమతి పి. మౌనిక, మూడో బహుమతి కె. అభినయ గెలుచుకున్నారు. వీరికి త్వరలో బహుమతులు అందిచనున్నట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ యాదమణిరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ యాకయ్య, సమ్మయ్య తదితరులు పాలొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


ప్రశంసా పత్రాలతో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని పసరమడ్ల గ్రామ పరిధిలోని జనగామ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఇటీవల జనగామలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో అండర్-17లో విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో జె. వెంకన్న (10వ తరగతి), జి. వినోద్ (10వ తరగతి), అండర్-14లో జె. తరుణ్ (9వ), జి. గౌతమ్(7వ), బి. హుస్సేన్ (9వ), బి. కిరణ్(9వ), రాజశేఖర్ (9వ), ప్రవీణ్ (9వ) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. లచ్చిరాం తెలిపారు. ఉపాధ్యాయులు రతన్‌సింగ్, జయరాం, రాములు పాల్గొన్నారు.


రాంప్రసాద్

● మండలంలోని వడ్లకొండ గ్రీన్‌వుడ్ ఉన్నత పాఠశాలకు చెందిన నామాల రాంప్రసాద్ (9వ తరగతి) ఎస్‌జీఎఫ్ పోటీలు కబడ్డీ అండర్-17 విభాగంలో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌ను పాఠశాల కరస్పాండెంట్ సల్లావుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్ అభినందించారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

నర్మెట్ట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల బకాయి కరవు బత్యాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఇప్ప రాంరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా చేరిన ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పలువురికి సభ్యత్వ రశీదులను అందజేశారు. నూతన టీచర్లు అంకిత భావంతో పనిచేసి విద్యారంగం మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివరాం, ఆంజనేయులు, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు భాస్కరుని పృథ్వీరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని టీపీయూఎస్ మండలాధ్యక్షుడు గునిగంటి యాదగిరి అన్నారు. సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులుల శ్రీనివాస్, సిద్ధారెడ్డి, నరేందర్, విజయ, తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ అరికట్టరూ..



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లుట్ల శివారు శ్రీనివాసనగర్ కాలనీలో తాగునీటి సరఫరా పైపులైన్ లీకేజీ అయింది. దీంతో జనగామ సూర్యాపేట జాతీయ రహదారిపై నీరు వృథాగా పోతూ వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. మరమ్మతు చేసి నీటి వృథాను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి మరమ్మతు చేయిస్తామని ఏఈ రోహిణి తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రామన్నగూడెంలో రావుల తిరుమల్ రెడ్డి నాన్నమ్మ ఇటీవల మృతి చెందడంతో మంగళవారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కె. వాసుదేవ రెడ్డి, రాష్ట్ర రెడ్కో మాజీ ఛైర్మన్ వై. సతీశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ వై. కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ మారపాక రవి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కందుకూరి ప్రభాకర్, ముసిపట్ల విజయ్, ఐలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సులో ప్రతి రోజూ పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్నారని, వెంటనే సదరు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి ఐకాస నాయకులు పిట్టల సురేష్, తుంగ కౌశిక్ మంగళవారం జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్‌కు ఫిర్యాదు అందించారు. పాఠశాల బస్సులను నిరంతరం తనిఖీ చేయాలని కోరారు.

వాగ్వాదంతో నిలిచిన వేలం


అధికారులతో వాగ్వాదం చేస్తున్న టెండర్ దారులు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: నవాబుపేట పశువుల సంతలో రహదారి రుసుం వసూళ్ల హక్కు కోసం మూడో సారి మంగళవారం నిర్వహించిన వేలం పాట అధికారులు, టెండర్‌దారుల మధ్య పరస్పర వాగ్వాదంతో నిలిచిపోయింది. మండలంలోని నవాబుపేట కోదండ రామస్వామి ఆలయ పరిధిలోని వారాంతపు పశువుల సంతలో రహదారి రుసుం వసూళ్లకు ఏటా వేలంపాట నిర్వహిస్తారు. గతేడాది వేలం ద్వారా రూ.1.05 కోట్ల ఆదాయం దక్కింది. ఈ ఏడాది సెప్టెంబరు 19న నిర్వహించిన వేలంలో రూ.75 లక్షల సీల్డు టెండర్ రాగా సరైన ధర రాకపోవడంతో వాయిదా వేశారు. అక్టోబరు 1న రెండోసారి నిర్వహించిన షీల్డు టెండర్‌లో వ్యాపారస్థులు రూ.80 లక్షలుగా కోట్ చేయడంతో మరోసారి వాయిదా వేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం వేలం నిర్వహించారు. 9 షెడ్యూళ్లకు గాను నలుగురు మాత్రమే షీల్డు టెండర్ డీడీలు అందజేశారు. అధికారులు బహిరంగ వేలం నిర్ణయించగా బూడిద రాజేశ్ పాడిన హెచ్చుపాట రూ.85.15 లక్షల వద్ద నిలిచింది. దేవాదాయ శాఖ షరతుల ప్రకారం గతేడాది రూ.1.05 కోట్లకు పైగా రాకపోవడంతో నిలిపివేస్తున్నట్లు పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, ఈవో వంశీ తెలిపారు. రూ.10 లక్షల చొప్పున ధరావత్తుగా డీడీలు తీశామని, హెచ్చు పాటకు నిర్ణయాన్ని ప్రకటించాలని లేదంటే తమ డీడీలు తమకు ఇవ్వాలని వ్యాపారస్తులు, షరతుల ప్రకారం డీడీలు తమ వద్ద ఉంటాయని అధికారులు పరస్పరం వాగ్వాదానికి దిగారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని, డీడీలు తీసిన వ్యాపారస్తులు అధికారులతో మాట్లాడాలి అంటూ వేలం నిలిపివేశారు.

జూదరుల అరెస్టు

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర శివారులో మంగళవారం జూదం ఆడుతున్న 18 మందిని పాలకుర్తి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.29 లక్షల నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని ఎస్సై లింగారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూధన్, ఎస్సైలు రంజిత్ కుమార్, దిలీప్ తెలిపారు. అరెస్టయిన వారిలో 12 మంది ఉండగా, వారిలో మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన మమత అనే మహిళ తన నివాసంలో అనుమానాస్పదంగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అనారోగ్య సమస్యలతో పాటు కుటుంబ కలహాలు, ఇతరాత్ర కారణాలతో మృతి చెంది ఉండొచ్చని సమాచారం. ఈ విషయంపై ఎస్సై లింగారెడ్డిని వివరణ కోరగా.. మృతి విషయమై తమకు ఫిర్యాదు అందలేదని వివరించారు.

నిర్వాహకుల బైండోవర్

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మద్యం గొలుసుకట్టు దుకాణాల్లో మంగళవారం అబ్కారీ పోలీసులు తనిఖీలు నిర్వహించి, పలువురు నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. అబ్కారీ సిబ్బంది గౌతమి, సోమేశ్వర్‌లు తమ్మడపల్లి, బచ్చన్నపేటలో బెల్టు షాపుల్లో తనిఖీలు జరిపి 10 మందిని తహసీల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ యాకన్న ఎదుట బైండోవర్ చేశారు.

మట్టి రవాణా ఫిర్యాదుపై విచారణ

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఇసుక, మట్టి తరలింపుపై రాష్ట్ర భూపరిపాలన, తదితర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుహాసిని విచారణ జరిపారు. రఘునాథపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన విచారణలో ఫిర్యాదు దారుడు థాకూర్ గ్యానేశ్ సింగ్ పాల్గొని వివరాలను వెల్లడించారు. వాల్టా చట్టానికి విరుద్ధంగా నేరస్థులకు సహకరించిన అధికారులతో పాటు ఇసుక, మట్టి అక్రమంగా తరలించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గ్యానేశ్ సింగ్ కోరారు. విచారణ నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుహాసిని తెలిపారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం నాగేశ్వర్‌రావులు అన్నారు. మంగళవారం బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్లలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని వారు ప్రారంభించి, మాట్లాడారు. అన్నదాతలు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాను, తదితరులు పాల్గొన్నారు.

వరికొయ్యలు కాల్చొద్దు


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: వరి కోతలు పూర్తయ్యాక వరి కొయ్యలు కాల్చవద్దని ఏడీఏ వసంత సుగుణ రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ మండల అధికారి చేబ్రోలు వెంకటేశ్వర్లు, ఏఈవో స్పందనతో కలసి మంగళవారం మండలంలో పంటలను పరిశీలించారు. పటేలుగూడెంలో రైతులతో మాట్లాడారు. వరికొయ్యలు కాల్చడం వల్ల భూమిలో ఉండే పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు నశిస్తాయన్నారు. వాతావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. నేలలో కలియదున్నాలని సూచించారు.

ఇందిరమ్మ కమిటీలో అవకాశం ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ కమిటీలలో అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సభ్యులుగా అవకాశం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో మంగళవారం నూతన శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ నెల 24న గ్రామంలో పార్టీ గ్రామ మహాసభ నిర్వహించనున్నట్లు, ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తదితరులు పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొడెపాక యాకయ్య, మల్లారెడ్డి, రాజు, మహేందర్, పరమేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి చేయూత

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుడు మాణిక్యపురానికి చెందిన ముమ్మాడి రాంబ్రహ్మం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భారాస శ్రేణులు, గ్రామస్థులు రూ.28 వేల నగదును సేకరించిన మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

రోడ్డు మరమ్మతులకు వినతి

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిన నేలపోగుల గ్రామం నుంచి జనగామ సూర్యాపేట రహదారిని కలిపే లింక్‌రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతూ గ్రామస్థులు ప్రత్యేకాధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మొరం పోయించి పునరుద్ధరించాలని వినతి పత్రంలో కోరారు.

శివరాజ్‌యాదవ్‌కు శివసేనారెడ్డి సన్మానం



జనగామ, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, సాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి జనగామ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్‌ను సన్మానించారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డును సందర్శించిన ఆయన శివరాజ్‌కు, ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ అభివృద్ధికి అందించిన సేవలకు గుర్తింపుగా శివరాజ్‌కు ఈ పదవి లభించడం సముచితమన్నారు. జనగామలో క్రీడాభివృద్ధికి, క్రీడా సౌకర్యాల పెంపునకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని, తాను హాజరవుతానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌ఛైర్మన్ కొల్లూరి నర్సింలు, టీపీసీసీ సభ్యుడు సీహెచ్ శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు సీహెచ్ బుచ్చిరెడ్డి, మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల నోడల్ అధికారులుగా ఎంఈవోలు



ఎంపికైన నర్మెట్ట ఆదర్శ పాఠశాల

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పలు ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసిన పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్) నోడల్ అధికారులుగా మండల విద్యాధికారులకు అప్పగిస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పీఎంశ్రీ పథకం కింద గుర్తించిన పాఠశాలలో విద్యార్థి హితకార కార్యక్రమాలు అమలవుతున్న నేపథ్యంలో మరింత పారదర్శకంగా వీటిని సమన్వయం చేసేందుకు ఎంఈవోలకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో మొదటి దశలో 543 వర్తమాన సంవత్సరంలో మరో 251 పాఠశాలను గుర్తించి ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సర్కిళ్లు, విజ్ఞాన యాత్రల నిర్వహణ, సహ సృజనాత్మకత పెంచే పలు కార్యక్రమాలు, విద్యారంగ నిపుణులతో అతిథేయ ప్రసంగాలు నిర్వహించి వాటి కోసం నిధులను అందిస్తుంది. తరచూ పాఠశాలల సందర్శనదుకు మండల విద్యాధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో నిరుడు తొలి విడతగా 62 పాఠశాలలు వర్తమాన విద్యాసంవత్సరంలో 30 బడులను గుర్తించింది.

ఉమ్మడి వరంగల్‌లో పథకానికి ఎంపికైన పాఠశాలలు

జిల్లా	మొదటి దశ	రెండో
జనగామ	10	5
మహబూబాబాద్	17	6
భూపాలపల్లి	6	2
ములుగు	6	5
హనుమకొండ	13	6
వరంగల్	10	6

ప్రమాదమని తెలిసీ.. పట్టాలు దాటుతూ..!



స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్థానిక రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటి వెళ్లడం ప్రమాదమని తెలిసినా ప్రయాణికులు నిత్యం అలాగే వెళ్తున్నారు. రైలు వస్తున్నా పట్టించుకోవడం లేదు. స్టేషన్‌కు కొద్ది దూరంలో ఉన్న పాత రైల్వే గేట్ వద్ద నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు పట్టాలు దాటుతూ మృత్యువాత పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.